
రంజాన్ వేళలు

గురువారం	శుక్రవారం
ఇఫ్తార్:	సహర్:
సా. 6.34	ఉ. 4.51

ప్రజలను దోచి పొడవడం, పరోక్షంగా వారి లోపాలను ఎంచడంలో ఆసక్తి కనబరిచే ప్రతీ ఒక్కరికి వినాశం తప్పదు





జోరుగా.. ఐపీఎల్ బెట్టింగ్



- ఐపీఎల్ వేళ రంగంలోకి నిర్వాహకులు
- రూ.లక్షలు చేతులు మారుతున్న వైనం
- ఆన్‌లైన్ ద్వారానే అన్ని లావాదేవీలు
- జిల్లాలో బెట్టింగ్ మోజులో అప్పులపాలవుతున్న బాధితులు
- ఐపీఎల్ బెట్టింగ్‌పై పోలీసుల నిఘా కరువు
- అరికట్టాలంటున్న జిల్లావాసులు

కామారెడ్డి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని కాకతీయనగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహించి సుమారు రూ.1.35లక్షలు కోల్పోయి అప్పుల పాలయ్యాడు. బీబీపేట మండల కేంద్రానికి చెందిన మరో యువకుడు క్రికెట్ బెట్టింగ్ కాసి రూ.50వేల వరకు నష్టపోయాడు. ఇలా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ బారిన పడి చాలా మంది యువకులు, పలువురు వ్యాపారవేత్తలు, క్రికెట్‌పై మోజున్న వారు అప్పుల పాలవడమే కాకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. కామారెడ్డి పట్టణంతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ, పలు మండల కేంద్రాల్లోనూ గుట్టుగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ కొనసాగుతుంది. గతంలోనూ కామారెడ్డిలో ఐపీఎల్ బెట్టింగ్ వ్యవహారంలో బెట్టింగ్ రాయుళ్ల వద్ద పలువురు పోలీసు అధికారులు మామూళ్లు వసూలు చేసిన ఘటనలో ఏసీబీకి చిక్కి సస్పెండ్ అయిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ ఐపీఎల్ సమయంలోనే కాకుండా వరల్డ్‌కప్, టీ-20 లాంటి క్రికెట్ మ్యాచ్‌ల్లోనూ జిల్లాలో జోరుగా బెట్టింగ్ సాగుతోంది. కానీ పోలీసులు మాత్రం క్రికెట్ బెట్టింగ్‌ను నిర్మూలించలేకపోతున్నారు. క్రికెట్ బెట్టింగ్ వల్ల తమ పిల్లలు అప్పుల పాలవుతున్నారని బెట్టింగ్‌ను నిర్మూలించాలంటూ జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

క్రికెట్‌పై క్రేజీ

క్రికెట్ ఆటపై యువతలో క్రేజీ అంతా ఇంత కాదు. మ్యాచ్ జరుగుతున్నంత సేపు ఉత్కంఠగా చూస్తుంటారు. తమ అభిమాన జట్టు విజయం సాధిస్తుందంటే తమ జట్టే గెలుస్తుందంటూ మరొకరు బెట్టింగ్ కాస్తుంటారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తోంది. దీంతో జిల్లాలో బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగారు. క్రికెట్‌పై మోజు ఉన్న యువత, వ్యక్తులను టార్గెట్ చేసుకుని వారిని బెట్టింగ్‌లోకి దింపుతున్నారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలతో పాటు మండలాల్లోనూ బెట్టింగ్ దందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న సమయంలోనే ఫోన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం ద్వారా రూ.1000 నుంచి రూ.1లక్ష వరకు డబ్బులు పంపుతూ బెట్టింగ్ పెడుతున్నారు. కొందరు నగదు రూపంలో బెట్టింగ్ నిర్వహిస్తుండగా మరికొందరు ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు నిర్వహిస్తున్నారు.





ఫోన్ ద్వారానే బెట్టింగ్

గతంలో ఐపీఎల్, ఇతర బెట్టింగ్‌ల కోసం ముంబాయి, నాందేడ్, హైదరాబాద్ లాంటి నగరాలకు చెందిన వారే ప్రధాన బుకీలుగా ఉండేవారు. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాలకు విస్తరించాయి. బెట్టింగ్ కాయలనుకునేవారు ముందుగా బుకీలకు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. గూగులోపే, ఫోన్‌పే, అకౌంట్ ట్రాన్స్‌ఫర్, పేటీఎం ద్వారా నగదు పంపిస్తే వారు ఆ వ్యక్తి కాసిన జట్టుపై బెట్టింగ్ నమోదు చేస్తుంటారు. ఒకవేళ బెట్టింగ్‌లో గెలిస్తే గెలిచిన మొత్తాన్ని బుకీ నుంచి నేరుగా లేదా ఫోన్‌పే, గూగులోపే ద్వారా తీసుకుంటారు. అయితే ఈ వ్యవహారమంతా ఫోన్ ద్వారానే జరుగుతుండడం గమనార్హం. మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో బెట్టింగ్‌లకు పాల్పడేవారు ఫోన్‌లతో రహస్య ప్రాంతాల్లో మకాం వేసి బెట్టింగ్‌లు పెడుతున్నారు. మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారనే దానితో పాటు ప్రతీ బాల్‌కు రన్‌పై, వికెట్‌పై కూడా బెట్టింగ్ పెడుతున్నారు. గెలిచిన, ఓడిన ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి.

బెట్టింగ్‌ల్లో యువతే ఎక్కువ

ఐపీఎల్ బెట్టింగ్ దిగుతున్నది ఎక్కువగా యువతే కావడం గమనార్హం. సరదా కోసమో, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆశతోనో చాలా మంది ఈ వ్యసనంలో చిక్కుకుంటున్నారు. రూ.100, రూ.200లతో ప్రారంభించి వేల రూపాయల్లో కాసే స్థితికి వెళ్తున్నారు. బెట్టింగ్ నిర్వాహకులు కూడా ఇలాంటి వారినే లక్ష్యంగా చేసుకుని వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి సభ్యులుగా చేర్చుకుంటున్నారు. మ్యాచ్‌ల వివరాలు పోస్టుచేస్తూ గెలిస్తే రెట్టింపు లాభం వస్తుందని ఆశ పెడుతూ ఇందులోకి లాగుతున్నారు. బెట్టింగ్‌కు అలవాటు పడిన వారిలో బడా వ్యాపారులు, రాజకీయ నాయకుల పిల్లలే కాకుండా సామాన్య, మధ్య తరగతి వారు కూడా ఉంటున్నారు. బెట్టింగ్‌లో పోగొట్టుకున్న డబ్బులను ఎలాగైనా తిరిగి గెలుచుకోవాలనే తాపత్రయంలో అప్పులు చేయడంతో పాటు ఇంట్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. నష్టపోయిన వారు తిరిగి చెల్లించలేక, ఎవరికి చెప్పుకోలేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనలు ఉన్నాయి. పరువు పోతుందని తల్లిదండ్రులు కూడా పోలీసు కేసుల వరకు వెళ్లకుండా స్తబ్దుగా ఉంటున్నారు. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ ప్రారంభం అయిన నేపథ్యంలో జిల్లాలో బెట్టింగ్ రాయుళ్లపై పోలీసులు దృష్టి సారించి బెట్టింగ్‌ను అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బెట్టింగ్ నిర్వహించే వారిపై నిఘా

- చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో, కామారెడ్డి

కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌పై పటిష్ట నిఘా ఏర్పాటు చేశాం. అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాం. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహణ చట్ట విరుద్ధం. బెట్టింగ్ నిర్వహించిన, బెట్టింగ్ కాసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కామారెడ్డిలో ఎక్కడైనా, ఎవరైనా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



ప్రభుత్వ బడులకు.. ఉచిత విద్యుత్!

- పాఠశాల మెయింటెనెన్స్ గ్రాంటు విడుదలకాక తిప్పలు
- విడుదలైన నిధులు నిర్వహణకే సరిపోని వైనం
- దీంతో పాఠశాలల్లో పెద్దఎత్తున పెండింగ్‌లో విద్యుత్ బిల్లులు
- తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో తొలగనున్న ఇక్కట్లు
- అధికారికంగా రావాల్సి ఉన్న ఉత్తర్వులు



కామారెడ్డి టౌన్, మార్చి 27: ప్రభుత్వ బడులకు విద్యుత్ భారం తప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే ఈనెల 1 నుంచే 200 యూనిట్లలోపు గృహ అవసర కరెంట్ వినియోగించే వారికి ఉచితంగా అందిస్తోంది. ఇళ్ల మాదిరిగానే ప్రభుత్వ బడులకు కూడా ఉచిత విద్యుత్ అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు ఇక కరెంట్ కష్టాలు తీరనున్నాయి. పాఠశాల నిర్వహణ కోసం అరకొర నిధులు విడుదలవడం విడుదలైనా అంతంత మాత్రంగానే విడుదల కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లోని ఇతర అవసరాలకే నిధులు సరిపోకపోవడంతో విద్యుత్ బిల్లులు చెల్లించలేక ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే భారీగా బిల్లులు పేరుకపోయాయని పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయడం లాంటి సంఘటనలు ఉన్నాయి. తాజా నిర్ణయంతో విద్యాశాఖాధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ ఇంకా అధికారికంగా ఉత్తర్వులు రాలేదని పేర్కొంటున్నారు.

పాఠశాల నిర్వహణకు అంతంత మాత్రంగానే నిధులు

ప్రభుత్వ పాఠశాలలకు ఏడాదికోసారి మెయింటెనెన్స్ గ్రాంట్స్ విడుదలవుతాయి. అవి కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. పాఠశాలల్లో ఒకటి నుంచి 30 మంది విద్యార్థులుంటే రూ.10 వేలు, 31 నుంచి 100 వరకు ఉంటే రూ.25 వేలు, 100 నుంచి 250 వరకు రూ.50వేలు, 250 నుంచి 1000 వరకు ఉంటే రూ.75వేల వరకు నిధులు విడుదలవుతాయి. అంతకన్న ఎక్కువుంటే రూ.లక్ష విడుదల చేస్తారు. అయితే ఈ నిధులు ఏ మాత్రం సరిపోవడంలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. చాక్ పీసులు, రిజిస్టర్‌లు, రికార్డులు, మరమ్మతు పనులు ఈ నిధుల ద్వారానే చేపట్టాల్సి ఉంటుంది. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులే తమ జేబుల్లో నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇదే కాక మరికొన్ని పాఠశాలలకు కనీసం విద్యుత్ సౌకర్యం లేక ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో తొలగనున్న ఇక్కట్లు

పాఠశాలల్లో కేటగిరి-7 ద్వారా సరఫరా అయ్యే విద్యుత్ అనేక అవసరాలకు ఉపయోగపడుతోంది. మధ్యాహ్న భోజన సమయంలో వంట చేయడానికి, విద్యార్థుల తాగునీటి కోసం, మరుగుదొడ్లు, పాఠశాలల్లో పెంచిన మొక్కలు, తోటలకు నీటిని అందించేందుకు, కంప్యూటర్ విద్య కోసం, డిజిటల్ తరగతుల ప్రొజెక్టర్ల కోసం విద్యుత్ అవసరం ఉంటుంది. అలాగే ఫ్యాన్లు, లైట్లకు తప్పనిసరి. ఈ క్రమంలో ఒక్కో పాఠశాలకు సంబంధించి రూ.2వేల నుంచి రూ.5 వేల వరకు కరెంటు బిల్లు వస్తోంది. ఈ బిల్లు చెల్లించక పోవడంతో ఒక్కో పాఠశాలల్లో వేలల్లో బకాయిలు పేరుకపోయాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వమే ప్రభుత్వ బడులకు ఉచితంగా విద్యుత్ అందించాలనే డిమాండ్ వస్తోంది. ఎట్టకేలకు ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోవడంతో ఆయా పాఠశాలల్లో విద్యుత్ బిల్లుల కష్టాలు తొలగిపోయి విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. మేయింటనెన్స్ గ్రాంట్లును ఇతర వాటికి ఉపయోగించుకునే వెసులుబాటు కలుగుతుంది.

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక నిఘా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భిక్కనూరు, మార్చి 27: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు రాష్ట్ర ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని జిల్లా ఎక్సైజ్ అధికారి రవీందర్ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన 'గంజాయి మత్తులో యువత' అనే కథనానికి స్పందిస్తూ జిల్లా ఎక్సైజ్ అధికారి 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం మాట్లాడారు. గత సంవత్సరం నుంచి నేటి వరకు జిల్లా ఎక్సైజ్ పరిధిలో ఆరు కేసు నమోదు చేయడంతో పాటుగా 3,950 గ్రాముల అల్ఫాజోలం, 460 గ్రాముల డైజోఫాం, 1940 గ్రాముల గంజాయిని పట్టుకుని ముద్దాయిలను అరెస్ట్ చేసి వారికి సంబంధించిన మూడు వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై యువతకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి అవగాహన కలిగిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు జిల్లాలో తమ సిబ్బందితో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్న వారిని పట్టుకునేందుకు ముమ్మర చర్యలు తీసుకుంటున్నామన్నారు.



పెద్దమల్లారెడ్డిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దమల్లారెడ్డిలో అవగాహన కార్యక్రమం

మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో దోమకొండ ఎక్సైజ్ అధికారులు యువతకు మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మధుసూదన్‌రావు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. దోమకొండ ఎక్సైజ్ పరిధిలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అర్హులు ఓటు హక్కును వినియోగించుకోవాలి



5 కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీలు

కామారెడ్డి టౌన్, మార్చి 27: అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు నిర్వహించిన 5కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించడంతో పాటు రన్‌లో ఎస్పీ సింధూశర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసి ప్రజాస్వామ్య పరిణతిని చాటాలన్నారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కుతో తమకు నచ్చిన నాయకున్ని ఎన్నుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. ఏప్రిల్ 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, పోలింగ్ శాతాన్ని పెంచడానికి తమ వంతు తోడ్పాటును అందించాలని కోరారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీవో రఘునాథ్‌రావు, సీపీవో రాజారాం, ఎన్నికల నోడల్ అధికారి వెంకటేష్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు, టీజీవో అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

కామారెడ్డి టౌన్, మార్చి 27: కామారెడ్డి మున్సిపల్‌లో పని చేస్తున్న కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని పేర్కొంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయాన్ని మూసివేసి నిరసన వ్యక్తం చేయడంతో మున్సిపల్ కమిషనర్ సుజాత చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా కార్మికులకు జీతాలు లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు తెచ్చుకుని జీవనాన్ని కొనసాగించాల్సి వస్తుందని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐలను అందించడం లేదని పేర్కొన్నారు. ప్రతీసారి ఇదే తరహాలో జీతాలను నెలల తరబడి చెల్లించడం లేదని కార్మికులకు తగిన న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



జీతాలను చెల్లించాలంటూ కమిషనర్‌కు విన్నవిస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మి నారాయణ

కోటగిరి,మార్చి27: ఎన్నికల రైతులకు ఘనమైన హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మి నారాయణ ఆరోపించారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో యెండల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల వేళ బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం కనీసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఉన్నదర కన్న రైతులు రూ.200 నష్టపోవాల్సి వస్తుందన్నారు.



కోటగిరిలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న యెండల

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో హిందువులపై దాడులు జరుగుతున్నాయన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో 12ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మండల మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా మహ్మద్ అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు అరుణ తారా, బీజేపీ నాయకులు ఎంబీ పాటిల్, జిల్లా ఉపాధ్యక్షులు దొరబాబు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, కోకన్వీనర్ శ్రీనివాస్, మండల అధ్యక్షులు ఏముల నవీన్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్



మున్సిపల్ చైర్‌పర్సన్‌ను వన్నెల్‌దేవి లావణ్యను ఆశీర్వదిస్తున్న తాహెర్

ఆర్మూర్‌టౌన్, మార్చి27: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆమె క్యాబిన్‌లో పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ఉర్దూ అకాడమిక్ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్ ఆమెను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా పరిష్కరిస్తానని, అవినీతి రహిత పాలనను అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌కుమార్‌రెడ్డి, ఏనుగంటి లింబాద్రిగౌడ్, చేపూర్ గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, బూరుగుల మల్లేష్‌గౌడ్, లగిశెట్టి శ్రీనివాస్, మూల ఎర్రన్న, కౌన్సిలర్‌లు ఇట్టెడి నర్సారెడ్డి, ఆకుల రాము, ఇంతియాజ్, వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

'సీఎం రేవంత్‌రెడ్డితో ముడుపు విప్పిస్తాం'



ఏర్గట్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, మార్చి 27: మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ మాట్లాడుతూ 'హాత్ సే హాత్ జోడో' యాత్రలో భాగంగా ఏర్గట్లకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి సంవత్సరం కావస్తోందని, యాత్రలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డితో ముడుపు కట్టించామని, ఆ ముడుపుని త్వరలో ఆయన్ని కలిసి ముడుపు విప్పిస్తామన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో కొత్త హమీలు అమలు చేశారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో రేండ్ల రాజారెడ్డి, బద్ధం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్, రొక్కెడ మో హన్, మేకల సాయన్న, ముస్కు మోహన్, కురాకుల భూమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో సంపర్క్ యోజన కార్యక్రమం



ఆర్మూర్‌లో ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్,మార్చి27: పట్టణంలోని రాంనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం లాబర్తి సంపర్క్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి మోదీ ప్రభుత్వం చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను గెలిపించాలని కరపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో లాబర్తి సంపర్క్ యోజన పార్లమెంట్ కన్వీనర్ పుప్పాల శివరాజ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్‌కుమార్, పొల్కం వేణు, పులి యుగంధర్, డికె.శ్రీనివాస్, బారడ్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు కళా బృందంచే అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రూరు, మార్చి 27 : సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం రుద్రూరు మండల కేంద్రంలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళా బృందం సభ్యులు సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత రక్షణ కోసం నిజామాబాద్ షీ టీమ్ రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, సమ్మర్ హాలీ డేస్‌లో ఈతకు ఎవరు వెళ్లకూడదని, అత్యవసర సమయంలో డయల్ 100ను ఉపయోగించుకోవాలన్నారు. అదే విధంగా మూఢ నమ్మకాలు నమ్మవద్దని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గల్ఫ్ దేశాలకు వెళుతున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రూరు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ అప్పారావు, రుద్రూరు పోలీసు సిబ్బంది, కళా బృందం సభ్యులు, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు, వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.

డీపీఓకు ఇచ్చిన ఫిర్యాదులపై డీఎల్‌పీవో విచారణ

ఎడపల్లి, మార్చి 27: ఎడపల్లి మండల కేంద్రంలోని రెండు సమస్యలపై సంబంధిత బాధితులు జిల్లా పంచాయితీ అధికారికి ఫిర్యాదు చేయగా వాటిని విచారించేందుకు బుధవారం బోధన్ డిఎల్‌పీఓ సాయిబాబా విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన నెల్లి రాజు, చంద్రకాంత్ రెడ్డి అనే ఇద్దరు వ్యక్తులు ఇంటి స్థలం కబ్జా, రహదారి విషయాలపై డిపీఓకు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీలో ఉన్న రికార్డులలోని వివరాలను సేకరించారు. సేకరించిన వివరాలతో గ్రామంలోని ఫిర్యాదు ఇచ్చిన స్థలాలను డీఎల్‌పీఓ ప్రత్యక్షంగా పరిశీలించారు. వాస్తవ, అవాస్తవాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సేకరించిన వివరాలతో కూడిన నివేదికను జిల్లా పంచాయితీ అధికారికి అందజేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి సుభాష్ చంద్రబోస్, పంచాయితీ కార్యదర్శి నాగరాజు గౌడ్, రాజేశ్వర్‌లతో పాటు పంచాయితీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ధర్మారం శివారులో మూడు వాహనాలు ఢీ

● ముగ్గురికి గాయాలు ● 108లో జిల్లా కేంద్రానికి తరలింపు

డిచ్‌పల్లి, మార్చి 27:డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం(బి) శివారులోగల అమృతగార్డెన్ రహదారిపై కారు అదుపుతప్పి బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని ఢీకొనడంతో ఆ ఇద్దరు వ్యక్తులు ఆటోను ఢీకొనడంతో ముగ్గురుకి గాయాలు అయ్యాయి. కామారెడ్డి నుంచి నిజామాబాద్‌కు పెళ్లి పత్రికలు పంచేందుకు వెళ్తూ ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని స్థానికులు తెలిపారు. గాయపడ్డ వారిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

బోధన్ రూరల్, మార్చి 27: బోధన్ మండలంలోని చిన్న మావంది గ్రామంలో బుధవారం తెల్లవారు జామున బండారి శిరీష (32) అనే వివాహిత మహిళ మంగళవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూ రల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని ఆయన తెలిపారు. మృతురాలికి భర్త మల్లేష్, ఒకపాప, ఒక బాబు ఉన్నారని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్నికోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామని ఆయన వివరించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించామన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వం పెంచిన టెట్ ఫీజును తగ్గించాలి'



టీయూలో కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

డిచ్‌పల్లి, మార్చి 27:తెలంగాణ టీచర్స్ ఎలిజిబులిటి టెస్ట్ టెస్ 2024కు సంబంధించిన ఫీజులను పెంపు చేయడం పేద విద్యార్థులకు భారం మోపడమేనని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు శివ అన్నారు. యూనివర్సిటీ సైన్స్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ 2021లో 200లు, 2022లో 300లు, 2023లో 400లు ఫీజుగా ఉన్న టెట్ ఫీజు ప్ర స్తుతం ఒక్కో పేపర్‌కు వెయ్యి రూపాయలు, రెండు వేల రూపాయలు వసూలు చేయడం బాధాకరమని ప్రభుత్వం వెంటనే పెంచిన ఫీజును తగ్గించి నిరుద్యోగులను ఆదుకోవాలన్నారు. ఫీజులను పెంచడం నిరుద్యోగులపై భారం మోపడమేనని ఆరోపించారు. తక్షణం తెలంగాణప్రభుత్వం ఫీజులను తగ్గించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో ఏబీవీపీ ప్రతినిధులు అమృత్, పావని, సింహాద్రి, తరుణ్, మహర్షి, రాము, సమీర్, మోహన్, బాల్‌రాజ్, హర్ష, అక్షయ్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా స్నేహభావం పెంపొందుతుంది



టీయూలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రొఫెసర్ కనకయ్య

డిచ్‌పల్లి, మార్చి 27:విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని క్రీడల ద్వారా స్నేహభావం పెంపొందుతుందని యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ కనకయ్య అన్నారు. ఎన్‌ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన కనకయ్య క్రీడాకారులను పరిచయం చేసుకొని వారిని ఉద్దేశించి మాట్లాడారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతోందని యూనివర్సిటీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలని ఈ పోటీలను నిర్వహించడం ఎన్‌ఎస్‌యూఐ అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ప్రొఫెసర్ కనకయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు శ్రీశైలం, మహేష్, రాజేందర్, సాగర్ నాయక్, శ్రీకాంత్, నవీన్‌కుమార్, నిరంజన్, విజయ్, అశ్విన్, అభినయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను కట్టని బిల్డింగ్ సీజ్

ఆర్మూర్‌టౌన్, మార్చి27: మున్సిపల్ పరిధిలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు అధికారులు గత కొన్నేళ్లుగా ఇంటి పన్నులు కట్టలేదని ఓ భవంతిని బుధవారం సీజ్ చేశారు. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చిన స్పందించడంలేదని, మున్సిపల్‌కు సుమారు రూ.5లక్షల 25వేలు బకాయి పడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ రెవెన్యూ అధికారి అయ్యూం,సలీం, అఫ్రోజ్,చక్రధర్, రాజు, సంతోష్, తదితరులు ఉన్నారు.



భవనాన్ని సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

'సంఘ అభివృద్ధికి సభ్యులు సహకరించాలి'



తూంపల్లిలో మాట్లాడుతున్న అధ్యక్షుడు మాలవత్ రాములు

సిరికొండ, మార్చి 27: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అభివృద్ధికి సభ్యులు సహకరించాలని అధ్యక్షుడు మాలవత్ రాములు కోరారు. సిరికొండ మండలం తూంపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం ఆవరణలో బుధవారం జరిగిన వార్షిక మహాజన సభలో రైతులను ఉద్దేశించి రాములు నాయక్ మాట్లాడారు. అంతకుముందు సహకార సంఘ కార్యదర్శి దేవిలాల్ వార్షిక నివేదిక చదివి వినిపించారు. సభ్యుల హర్షధ్వానాల మధ్య నివేదికను ఆమోదించారు. సభ్యులను ఉద్దేశించి రాములు నాయక్ మాట్లాడుతూ.. సంఘంలో రుణాలు తీసుకున్న సభ్యులు సకాలంలో చెల్లించాలని కోరారు. కొత్త సభ్యులకు రుణాలు ఇవ్వాలంటే అప్పులు తీసుకున్న సభ్యులు సకాలంలో చెల్లించడం అవసరం అన్నారు. రైతులకు కావాలసిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. సంఘం అభివృద్ధి చెందాలంటే సభ్యుల సహకారం ఎంతైనా అవసరం ఉందన్నారు. వచ్చే వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు అబ్బాస్, డైరెక్టర్లు లక్ష్మన్ రమేష్,రూప్‌సింగ్ డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ బూస దేవరాజు, నాయకులు శ్రీధర్, వినోద్ , సిబ్బంది రైతులు పాల్గొన్నారు,

వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలి

● మోర్తాడ్‌లో వర్షపు నీటి నిల్వ గురించి ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ప్రచారం ● బ్రాహ్మణపల్లిలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మోర్తాడ్‌లో ప్రచారం చేస్తున్న విద్యార్థులు

మోర్తాడ్, మార్చి27:మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు కార్యక్రమంలో భాగంగా బుధవారం వర్షాపు నీటిని నిల్వ చేసుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రచారం నిర్వహించారు. మానవళి జీవితం నీటిపై ఆధారపడి ఉందని, ప్రతీ నీటి బొట్టు వృధా చేయకుండా నిల్వ ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న తెలిపారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. వర్షపు నీటిని ఇంటి పైకప్పు నుంచి ఎలా నీరు నిల్వ చేసుకోవాలో పోస్టర్ల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ధర్పల్లి భూపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో ఆర్మూర్ సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతుంది. బుధవారం గ్రామంలో అందె జీవన్ రావుచే సూపర్ బ్రెయిన్ యోగా, ఆర్థిక అక్షరాస్యతపై గ్రామ స్తులకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిం చారు. ఈ శిబిరంలో డాక్టర్‌లు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి చైతన్యశాంతి,ప్రోగ్రాం సభ్యురాలు స్వప్న,ఎంపీటీసీ రాజు, మాజీ సర్పంచ్‌లత దేవరాజ్,ఎన్ఎస్ఎస్‌విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో సదుపాయాలను ఏర్పాటు చేయాలి



డొంకేశ్వర్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

డొంకేశ్వర్ మార్చి27: పోలింగ్ బూత్‌ల లో మౌలిక సదుపాయాలు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా బుధ వారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పరి శీలించారు. ప్రభుత్వ పాఠశాల, గ్రామపం చాయతీ భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, మరుగు దొడ్లు, ఫ్యాన్, విద్యుత్‌లైట్లు, దివ్యాంగుల కోసం ర్యాంపులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో ఆ యన రికార్డులను తనిఖీ చేశారు. ఆయ న వెంట తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ రాజేశ్వర్, సర్వేయర్ కిషన్, కార్య దర్శి శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొ న్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్సై

జక్రాన్‌పల్లి,మార్చి 27: మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో కొందరు గ్రామపెద్దలు గ్రామశివారు లోని వాగులో నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేయడానికి వేలం పాట ద్వారా డబ్బులు వసూలు చేసి ఇసుక అక్రమ రవాణాకు సహయపడుతున్నారని తెలిసి ఏడుగురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి నట్లు ఎస్సై తిరుపతి బుధవారం తెలిపారు. వాగులకు సందించి ఇసుక తరలింపు కొరకు అనుమతులు మంజూరు చేసే అధికారం ప్రభుత్వానికి మాత్రమే ఉందని, గ్రామాలలో ఇతర వ్యక్తులు ఎవ రైనా ఇసుక తీయడానికి డబ్బులు వసూలు చేసే అధికారం ఎవ రికి లేదన్నారు.ఒకవేళ ఎవరైనా చట్టవ్యతిరేకంగా చేస్తేచట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. అక్రమ ఇసుకరవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని అన్నారు.

'వచ్చిన లాభాలు రైతులకే చెల్లిస్తాం'



అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్

సిరికొండ మార్చి 27: పాల ఉత్పత్తులను విక్రయించగా వచ్చిన లాభాలు రైతులకే చెల్లిస్తామని కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వ ర్‌రావు చెప్పారు. సిరికొండ మండల కేంద్రంలో కరీంనగర్ పాల కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అవుట్‌లెట్‌ను బుధవారం ప్రారంభించారు. రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ..మార్కెట్లో ప్రైయివేట్, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్నో పాలకేంద్రాలు నడుతస్తున్నప్పటికి కరీంనగర్ కేంద్రంగా లక్షా మంది రైతులతో ఏర్పాటు చేయబడిన కరీంనగర్ పాల కేంద్రంలో సేకరించిన పాలను నాణ్యమైన పాలను వినియోగదారులకు చేరవేస్తూ ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. వచ్చిన లాభాలను సభ్యులకే చెల్లిస్తామన్నారు. ఆయన వెంట జనరల్ మేనేజర్ రాజశేఖర్ రెడ్డి, ఇతర సిబ్బంది నరేష్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

పడకల్‌లో గ్రామీణ గ్రంథాలయ పునఃప్రారంభం

జక్రాన్‌పల్లి, మార్చి27: మండలంలోని పడకల్ గ్రామంలో గ్రామీణ గ్రంథాలయాన్ని పునఃప్రారంభించారు. గ్రంథాలయానికి దాతలు లోక పురుషోత్తం రూ.5వేల విలువ గల పోటీ పరీక్షల పుస్తకాలను వితరణ చేశా రు. నిమ్మల రూ.15వేలు ఇప్పించడమే కాకుండా తనవంతుగా రూ.5వేల పుస్తకాలను, ప్రముఖ వైద్యుడు ఆర్థోపెటిక్ డాక్టర్ శంభ గ్రామీణ గ్రంథాలయానికి రూ.10వేల విలువ గల పోటీ పరీక్షల పుస్తకా లను ప్రత్యేక అధికారికి అంకం నరేష్, ఎల్లమ్మ శ్రీనివాస్ ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి భరత్ కుమార్,బాలాగౌడ్,పోశెట్టి, కుమార్, చందు, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.



పడకల్‌లో పుస్తకాలను అందజేస్తున్న దాతలు

చికున్‌గున్యాతో నడిపల్లిలో 25మందికి అస్వస్థత



చికున్‌గున్యాతో బాధపడుతున్న బాధితులు

డిచ్‌పల్లి,మార్చి 27:డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నడిపల్లి గ్రామంలో గత వారం రోజులుగా చికున్‌గున్యా వ్యాధి తో 25 మంది బాధితులు బాధపడుతున్నట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. వైద్య సిబ్బందికి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తాము కోరినప్పటికీ బాధితులు కీళ్లు, కాళ్ల నొప్పులతో నడవలేని పరిస్థితి ఎవరు కూడా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోయారు. గ్రామానికి చెందిన రుద్రబోయిన కవిత, రుద్రబోయిన వీని, రంజిత్, వెంకటస్వామి, సుదర్శన్, రవి, సంతోష్, సు జాత, సుమ, రాజేందర్, మరికొంత మం ది చికున్‌గున్యావ్యాధితో ఇబ్బం దులు పడుతున్నారని వెంటనే జిల్లా వైద్య శాఖ అధికారులు గ్రామంలో వ్యాధి తో బాధపడుతున్న వారికి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వ్యాధినిర్మూలనకు కృషి చేయాలని కోరుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో అరుణ్‌కుమార్

డిచ్‌పల్లి,మార్చి27:వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని నడిపల్లి సచివాలయం వద్ద గ్రామపంచాయతీ సిబ్బంది చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీవో అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.బుధవారం సచివాలయంవద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాలకు కూడా నీటి తొట్టెలను ఏర్పాటు చేసి.. తాగునీటి కోసం పశువులు అల్లాడకుండా ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీడీవో పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్,పంచాయతీ ఈవో కిషన్ రావు,కార్మికశాఖ అధికారి నరేందర్‌రాజు, పంచాయతీ సిబ్బంది సంతోష్‌రాము, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● పీఏసీస్ చైర్మన్ భరత్‌రెడ్డి



డొంకేశ్వర్‌లో మహిళలకు కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తున్న చైర్మన్ భరత్‌రెడ్డి

డొంకేశ్వర్,మార్చి27:మహిళలకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో డొంకే శ్వర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా కుట్టు మిషన్‌లను పంపిణీ చేస్తున్నామని పీఏసీఎస్‌చైర్మన్ భరత్‌రెడ్డి అన్నారు. బుధవారం డొంకేశ్వర్ ప్రాథమిక సహకార సంఘంలో 21మంది మహిళలకు రుణం ద్వారా కుట్టుమిషన్‌లను అందిం చారు. ఏడాదికి 50చొప్పున పంపిణీ చేయాలన్నలక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని,ఆసక్తి గలపాడి రైతులకు గిరి ఆవులను రుణం ద్వారా సొసైటీ లో అందిస్తామన్నారు. ఆసక్తి గల రైతు లు సొసైటీకి వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టామ న్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ రాధ, కార్యదర్శి కృష్ణ, వైస్‌చైర్మన్ మోర్తాడు ముత్యం, డైరెక్టర్‌లు పెంటన్న, గంగారెడ్డి, సంజీవ్, గంగాధర్, ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

సజ్జ పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు



సజ్జ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఆర్మూర్‌రూరల్, మార్చి27: ఆర్మూర్ మండలం ఫత్తేపూర్, సుర్బిర్యాల్, ఆలూర్ మండల కేంద్రంలో వ్యవసాయాధికారులు తెగులు సోకిన సజ్జ పంటను పరిశీలించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో సజ్జ పంటకు తెగులు ఆందోళన రైతులు అనే ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు బుధవారం గ్రామాలలో పర్యటిస్తూ తెగులు సోకిన సజ్జ పంటను పరిశీలిస్తున్నారు. ఈసందర్భంగా మండల వ్యవసాయాధికారి హరికృష్ణ రైతులతో మాట్లాడుతూ సజ్జ పంటలో కత్తెర పురుగు, మొగిపురుగు ఉధృతి అధికంగా ఉందని అన్నారు. పురుగు నివారణకు క్లోరంత్ర నిలిప్రోల్ 80ఎంఎల్ మందును 200లీటర్ల నీటిలో లేదా ఇమామెక్టిన్ బెంజియేట్ నోవసురన్ 300ఎంఎల్ లేదా, క్లోరంత్ర నిలిప్రోల్ సైలోత్రిన్ 100ఎంఎల్ మందులను 200లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణధికారి వసుదం, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, నడిషెరం మల్లయ్య, బార్ల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు



గుమ్మిర్యాల్‌లో సజ్జ పంటను పరిశీలిస్తున్న ఏవో

ఏర్గట్ల,మార్చి27: మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో బుధవారం సజ్జ, నువ్వులు, వరి పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈసంద ర్భంగా ఏవో అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ సజ్జ పంటలో కత్తెర పురుగుఉధృతి గమనించడం జరిగిందని రైతులు తగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నువ్వులో ప్రస్తుతం రసం పీల్చు పురుగులు ఆశిస్తాయని వాటి నివారణ కోసం చర్యలు చేపట్టాలన్నారు.అలాగే వరిలో సుడిదోమ ఆశించే అవకాశాలు ఎక్కుగా ఉన్నాయని, వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు.పలుసలహాలు, సూచనల కోసం వ్యవసాయాధికారులు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సాయిసచిన్, స్నేహ పాల్గొన్నారు.

బీపెడ్ పరీక్షకు నలుగురు విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి, మార్చి 27:తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో బీపెడ్ మొదటి, మూడవ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంటచంద్రశేఖర్ తెలిపారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెంటర్‌లో 81 మంది విద్యార్థులకు గాను 77 మంది విద్యార్థులు హాజరుకాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

డొంకేశ్వర్ మార్చి27: డొంకేశ్వర్ మండలం కోమటిపల్లి గ్రామ సమీ పంలో రెండు పేకాట స్థావరాలపై దాడి చేసి ఎని మిది మందిని అరెస్టు చేసినటుట ఎస్సై రాహుల్ తెలిపారు. బుధవారం గ్రామంలో పక్క సమా చారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా ఎనిమిది మంది పేకాటరా యుళ్లను అదుపులోకి తీసుకొని రూ. 4987ను స్వాధీనం చేసుకు న్నామని, వారిపై కేసు నమోదు చేసిన ట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.


భిక్కనూరు ప్రభుత్వ కార్యాలయాల్లో నిశ్శబ్ద వాతావరణం

- ఎంపీడీవోను ఏసీబీ అదుపులోకి తీసుకోవడంతో అధికారుల గుండెల్లో గుబులు
- లంచగొండులను పట్టుకోవాలంటున్న మండల వాసులు

భిక్కనూరు, మార్చి 27: బల్లకింద చెయ్యి పెట్టడం, అందినకాడికి దోచుకోవడం ఇదే కొంత మంది అధికారుల తీరు. ప్రతీ చిన్న పనికి క్రమంగా అమాయకుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్న అవినీతి అనకొండలు భిక్కనూరు మండలంలో చాలా మందే ఉన్నారు. ఏసీబీ అధికారుల ఎఫెక్ట్‌తో భిక్కనూరు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం నిశబ్ద వాతావరణం నెలకొంది. మంగళవారం భిక్కనూరు మండల అధికారి ఎంపీడీవో సంతోష్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వచ్చిన సంగతి తెలియక వారు ఏ కార్యాలయానికి వెళ్తారో ఎవరిని పట్టుకుంటారోనని మండలంలోని ఆయా శాఖల అధికారులకు ముచ్చెమటలు పట్టినట్లు సమాచారం. చివరికి ఎంపీడీవోనే కమ్మర్‌పల్లి మండలంలో జరిగిన అవినీతి ఆరోపణల్లో ఏ1గా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారన్న సమాచారం తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోను ఏసీబీ అధికారులు అరెస్టు చేయడంతో మండలంలోని మిగితా శాఖల అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని ఆయా శాఖల అధికారులు భయం గుప్పిట్లో గడుపుతున్నారు. మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

ఏ పని కావాలన్నా ముడుపులు తప్పనిసరి?

మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి రాజ్యం మేలుతుందని, ఏ చిన్న పని కావాలన్నా పనిని బట్టి ముడుపులు చెల్లించాల్సి వస్తుందన్న ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఒకవేళ ముడుపులు



భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయం

చెల్లించని యెడల వారి పనులను చేయడానికి నెలల తరబడి కార్యాలయాల చుట్టూ అవినీతి అధికారులు తింపించుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పలుశాఖల్లో చిన్న స్థాయి ఉద్యోగి నుంచి మొదలుకొని మండల స్థాయి అధికారుల వరకు పలువురు అధికారులు, సిబ్బంది లంచాలకు అలవాటు పడి పనిని బట్టి అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి.

మధ్యవర్తులతో రాయబారాలు

ఆయా శాఖల్లోని లంచగొండి అధికారులు మధ్యవర్తులను ఏర్పాటు చేసుకుని వారి సహాయంతో ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నారని, ఆయా శాఖల అధికారుల ఆదేశాల మేరకు చిన్నచిన్న తప్పులను భూతద్దంలో పెద్దవిగా చూపిస్తూ మధ్యవర్తులతో సహాయంతో అమాయకుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి సంఘటనలు మండలంలో చాలానే ఉన్నాయి. మండలంలో ఈ శాఖ, ఆ శాఖ అనే తేడా లేకుండా లంచగొండి అధికారులు, పలువురు సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నారు.

లంచగొండులను పట్టుకోవాలని వేడుకోలు

భిక్కనూరు మండలంలో పలు శాఖల్లో లంచగొండులు రాజ్యమేలుతున్నారని వారి ఆగడాలకు అంతులేకుండా పోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి. ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా లంచగొండులకే ఆయా శాఖల అధికారులు మద్దతిస్తున్నారని, భిక్కనూరు మండలంలోని లంచగొండులపై ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండలంలోని పలువురు బాధితులు కోరుతున్నారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

- ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి టౌన్, మార్చి 27: రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవడంతో పాటు, ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్పీ సింధూశర్మ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు అధికారులతో నెలవారి సమీక్ష నిర్వహించారు. ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో సమస్యాత్మక వ్యక్తులు, రౌడీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించే విధంగా పని చేయాలని తెలిపారు. గంజాయి, అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగులు, జూదం, మట్కా అలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమ మద్యం, నగదు రవాణాను నిరోధించడంలో భాగంగా చెక్‌పోస్టులలో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరైన పరిమితికి మించి నగదును రవాణా చేస్తూ పట్టుబడితే ఎన్నికల నియమావళి ప్రకారం కేసు నమోదు చేయాలని తెలిపారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని తెలిపారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. సైబర్ నేరాల భారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా చేస్తూ అవగాహన చేపట్టాలని అన్నారు. ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. విధులలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి అవార్డులు అందించారు. అవార్డులు అందుకున్న వారిలో శ్రీనివాస్ సీసీఎస్ ఇన్స్‌పెక్టర్, తిరుపయ్య టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్, సంతోష్‌కుమార్ సదాశివనగర్ సీఐ, ఎండీ ఉస్మాన్ ఎస్ఐ సీసీఎస్, సయ్యదుద్దీన్ కిషన్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుళ్లు, మైసయ్య, శ్రావణ్ కుమార్, రాజేంద్రకుమార్, గణపతి, రవి, శ్రీనివాస్, స్వామి, సీసీఎస్ కానిస్టేబుళ్లు, భద్రయ్య, ముఖేష్, శ్రీకాంత్, యోగేష్, మల్లేష్ ఏఆర్ హెడ్‌క్వాటర్స్‌లు ఉన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ జార్జ్, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ మురళి, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నిరసిస్తూ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

భిక్కనూరు, మార్చి 27: విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ రైతులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన సంఘటన భిక్కనూరు మండలంలోని కాచాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. కాచాపూర్ గ్రామంలో వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ ఇవ్వకుండా కోతలు ఎందుకు విధిస్తున్నారని గ్రామానికి చెందిన రైతులు ఉదయాన్నే సబ్‌స్టేషన్‌కు చేరుకుని సబ్‌స్టేషన్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని ఒక పౌల్ట్రీకి విద్యుత్ సరఫరా అవుతున్న సమయంలో ఓవర్‌లోడై గ్రామంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, ఈ సమస్య చాలా రోజులుగా ఉందన్నారు. ఎన్నిసార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులను సంప్రదిస్తే పౌల్ట్రీకి అనుకూలంగా మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత రాత్రి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లేదన్నారు. ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉందని వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా ఇవ్వాలని లేనియెడల పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం ఆరు గంటలకు సబ్‌స్టేషన్‌కు వచ్చిన రైతులు తొమ్మిది గంటల వరకు సబ్‌స్టేషన్‌లోనే బైఠాయించారు. ఈ మేరకు భిక్కనూరు ఇన్‌చార్జి ఏఈ శ్రీనివాస్‌ను సంప్రదించగా సబ్ స్టేషన్‌లో టెక్నికల్ సమస్యతో వ్యవసాయ బావుల వద్ద ఓవర్‌లోడై ట్రిప్ అవుతుందన్నారు. వెంటనే తమ సిబ్బంది సమస్యను పరిష్కరించారన్నారు.


కాచాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

అన్ని సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉండేవిధంగా కృషి చేయాలి

సదాశివనగర్, మార్చి 27: గ్రామ సమాఖ్య మహిళ సంఘాలు ప్రతీ ఒక్కటి ఏ గ్రేడ్‌లో కొనసాగే విధంగా మహిళ సంఘాల అధ్యక్షురాలు, కోశాధికారులు కృషి చేయాలని ఏపీఎం రాజారెడ్డి తెలిపారు. బుధవారం సదాశివనగర్ మహిళ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో కొనసాగుతున్న మహిళ సంఘాలను ప్రతీ ఒక్కటి ఏ గ్రేడ్ విధానంలో కొనసాగే విధంగా కృషి చేయాలని తెలిపారు. పుస్తకాల నిర్వహణ, అప్పుల వివరాలు తిరిగి చెల్లింపుల వివరాలు ప్రతి నెల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తు రుణాలు పొందిన ప్రతీ సభ్యురాలు రుణాలు ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారు, ఆర్థిక పరిస్థితులు ఎలా మెరుగుపడుతున్నాయనే వివరాలను క్షుణంగా గ్రామ అధ్యక్షురాలు పరిశీలిస్తూ ప్రతీ మహిళ ఆర్థికంగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు అంజనేయులు, రాములు, నవీన్, లింగం, కృష్ణ, అంజలి పాల్గొన్నారు.

బీజేవైఎం నూతన కార్యవర్గం ఎన్నిక

సదాశివనగర్, మార్చి 27: భారతీయ జనతాపార్టీ యువమోర్చా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కుంట రాంరెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా దోడ్లె కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా వడ్ల రామకృష్ణ, ఏనుగు సంజీవరెడ్డి, ఉపాధ్యాక్షుడిగా పిల్లినవీన్, కాటిపల్లి ప్రణీత్‌రెడ్డి, చిన్నదొర సంతోష్, వడ్ల వంశీ, కార్యదర్శులుగా బోద్దుల మనోహర్, సింపల్లి మహేష్, వడ్ల శ్రీరాం, చాకలి ప్రణీత్, కోశాధికారిగా నారెడ్డి నరేష్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమృతభూంరావు, రమేష్‌రెడ్డి,చక్రధర్‌గౌడ్, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలపై చర్చ

కామారెడ్డి రూరల్, మార్చి 27: జిల్లా కేంద్రంలోని పట్టణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్ని కులాల ప్రతినిధులు వీక్లీ మార్కెట్‌లో గల పోచమ్మ గుడి వద్ద చర్చించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు కావల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఎడ్లబండ్ల ప్రదర్శనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన పలు ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పట్టణాభివృద్ధి సంఘం ప్రతినిధులు అధ్యక్షుడు దాదె బాల్‌రాజ్, రామారెడ్డి సాయిలు, అన్నారపు మోహన్‌రెడ్డి, క్రిష్ణ యాదవ్, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎలక్టోరల్ బాండ్ రాజ్యాంగ విరుద్ధం

- రాష్ట్ర అధికార ప్రతినిధి రామ్‌చందర్‌గౌడ్

కామారెడ్డి టౌన్, మార్చి 27: సుప్రీంకోర్టు బీజేపీ ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని నిషేధించిందని రాష్ట్ర అధికార ప్రతినిధి రామ్‌చందర్‌గౌడ్ అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎన్నికల విరాళాలపై పూర్తి సమాచారాన్ని మార్చి 6,2024లోపు బహిరంగపరచాలని, ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఎస్‌బీఐని ఆదేశించిందని తెలిపారు. రాజకీయపార్టీలు సమష్టిగా 12 వేల కోట్లకుపైగా విరాళాలు అందుకున్నాయని కేవలం బీజేపీ మాత్రమే రూ.26,566 కోట్లను అందుకుందని తెలిపారు. బీజేపీకి విరాళాలు అందజేసిన కార్పొరేట్‌లతో తమకున్న సంబంధాలు బహిర్గతం అవుతాయని బీజేపీ ఆందోళన చెందుతుందని తెలిపారు. ఈ సమాచారాన్ని పంచుకోవద్దని మోదీ ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై ఒత్తిడి తెచ్చిందని ఆరోపించారు.

రైతుల అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తా

- సొసైటీ చైర్మన్ పట్లోళ్ల రామకృష్ణారెడ్డి

బిచ్కుంద, మార్చి 27: సొసైటీపరంగా రైతులకు వ్యవసాయ అవసరాలు తీర్చేందుకే సేవలందిస్తానని సొసైటీ చైర్మన్ పట్లోళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పుల్కల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అధ్యక్షతన రైతు మహాజన సభను సొసైటీ కార్యదర్శి సాయిప్రకాష్ సమావేశం ఏర్పాటు చేసి అర్థ సంవత్సర జమ, ఖర్చులను చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు కొనుగోలుతో పాటు విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచుతూ వ్యవసాయపరంగా రైతుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎన్‌డీసీసీ డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి, సొసైటీ డైరెక్టర్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రకాష్‌పటేల్ ఎన్నిక

బిచ్కుంద, మార్చి 27: బిచ్కుంద బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రకాష్ పటేల్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మల్లేశ్వర్, కోశాధికారిగా విఠల్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూం భద్రతపై ప్రత్యేక దృష్టి

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి

మద్నూర్, మార్చి 27: ఈవీఎం స్ట్రాంగ్‌రూం భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి భద్రంగా ఉండేలా చూడాలని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జుక్కల్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మద్నూర్ మండల కేంద్రంలో ఈవీఎం భద్రపరిచే ప్రభుత్వ బాలుర పాఠశాలలో, ఎన్నికల సామగ్రి భద్రపరిచే కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈవీఎం, ఎన్నికల సామగ్రి, పంపిణీ చేసే ప్రాంతం పరిసరాలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆయా పార్టీల నాయకులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని, అభ్యర్థులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అధికా రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, సర్వేయర్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

దయానంద సరస్వతీ జయంతిని విజయవంతం చేయాలి

బాన్సువాడ టౌన్, మార్చి 27: ఈ నెల 31న ఇందూరులో నిర్వహించనున్న మహర్షి దయానంద సరస్వతీ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఇందూరు సమాజ్ అధ్యక్షుడు కరిపే సూర్యప్రకాశ్ ప్రజలను కోరారు. బుధవారం ఆయన పట్టణంలోని ఆర్యసమాజ్ మందిరంలో ప్రతినిధులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 31న జరిగే ఉత్సవాలకు బాన్సువాడ నుంచి హిందూ బంధువులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నారాయణ, శ్రీనివాస్, హరిదాస్, నరేష్ గోజే, నవీన్ తదితరులున్నారు.


కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కార్మికశాఖలో రెగ్యులర్ అధికారిని నియమించాలి

బాన్సువాడ టౌన్, మార్చి 27: బాన్సువాడ కార్మికశాఖలో రెగ్యులర్ అధికారిని నియమించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్‌రాములు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని లేబర్ ఆఫీసు ముందు తెలంగాణ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇన్‌చార్జీగా పని చేసిన అధికారి బదిలీపై వెళ్లి 12 రోజులు గడుస్తున్నా కొత్త అధికారిని నియమించకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ అధికారిని నియమించాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం కార్యాలయ ఉద్యోగికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, కిష్టయ్య, లక్ష్మణ్, బాల్‌రాజ్, పోచవ్వ, విజయలక్ష్మీ తదితరులున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పోచారం క్లారిటీ ఉన్న నాయకుడు

- పోచారంపై విమర్శలు చేస్తే సహించేది లేదు

బాన్సువాడ టౌన్, మార్చి 27: మా నాయకుడు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మొదటి నుంచి క్లారిటీ ఉన్న నాయకుడని, నియోజకవర్గ ప్రజలకు జవాబుదారీగా ఉంటారని కానీ కాంగ్రెస్ నాయకులకు కాదని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులపై ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌లో నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై అనవసర విమర్శలు చేస్తే సహించేదిలేదన్నారు. కాంగ్రెస్ నాయకుడు ఏనుగు రవీందర్‌రెడ్డి మెప్పు కోసం ఎమ్మెల్యే పోచారంపై అవాకులు, చవాకులు పేలితే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులుగా చలామణి అవుతున్న వారు ప్రజాక్షేత్రంలో రావాలని, నాయకుడిగా పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో నార్ల ఉదయ్, నాయకులు ఏజాస్, బాబా, హకీం, వెంకటేశ్, కనుకుట్ల రాజు తదితరులున్నారు.


మద్నూర్‌లో మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలి

- తహసీల్దార్ ఎండీ ముజీబ్

మద్నూర్, మార్చి 27: సాధారణ ఎన్నికల్లో ప్రతీ ఒక్క ఓటరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ముజీబ్ అన్నారు. మండల కేంద్రంలో ఓటర్లను చైతన్యం చేస్తూ ఎన్నికల్లో ఓటర్లను భాగస్వామ్యం చేయడానికి ఉద్దేశించిన కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు 5కె రన్ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి ఓటు హక్కును వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. ప్రధాన వీధుల గుండా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీవో వెంకట నర్సయ్య, ఎలక్షన్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ విజయ్, గిర్దావర్ శంకర్, తదితరులున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన

కామారెడ్డి రూరల్, మార్చి27: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఎన్ఎస్ఎస్ విభాగం తెలంగాణ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వన్డే రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ కన్వెన్షన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగహన కలిగి ఉండాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ రవీందర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ కంట్రోల్ యూత్ కోఆర్డినేటర్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిష్టయ్య, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.శంకర్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ చంద్రకాంత్, వక్తలు రిటైర్డ్ ప్రొఫెసర్ నరసింహరావు, స్వామి, ఎన్ఎస్ఎస్ సలహదారులు డాక్టర్ పి.రాజ్‌గంభీర్‌రావు, ప్రభుత్వ ప్రైవేట్ కళాశాల ప్రోగ్రాం అధికారులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

25 తులాల బంగారం చోరీ

మద్నూర్, మార్చి 27: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మహాజన్ బాలాజీ అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరుగగా, 25 తులాల బంగారం, రూ.16వేల నగదు దొంగిలింపబడినట్లు మద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మహాజన్ బాలాజీ గతంలో వడ్డీ వ్యాపారం చేసేవాడని, బంగారం పెట్టుకుని డబ్బులు ఇచ్చే వాడని, వారికి సంబంధించిన 15 తులాల బంగారంతో పాటు తన వద్ద 10 తులాల బంగారం ఇంట్లో బాలాజీ లేని సమయంలో గుర్తు తెలియని వారు దొంగిలించినట్లు ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడిపై కుక్కల దాడి

ఎల్లారెడ్డి, మార్చి 27: ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని ఒకటవ వార్డు ఎర్రమనుకుచ్చ ప్రాంతానికి చెందిన రవి అనే యువకుడు ఉదయం రోడ్డుపై వెళుతుండగా రోడ్డు పక్కన ఉన్న శునకాలు ఒక్కసారిగా మీద పడి గాయపరిచి దాడి చేశాయి. స్థానికులు గమనించి చికిత్స కోసం వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ వార్డులలో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభం

దోమకొండ, మార్చి 27: మండలంలోని అంచనూరు గ్రామంలో బుధవారం బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. ఈ సదర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ అంచనూర్ గ్రామంలో నీటి ఎద్దడి ఉందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పన్యాల రవీందర్‌రెడ్డి, అనుపాటి నరేందర్‌రెడ్డి, రవి, సత్యనారాయణ, లక్ష్మణ్, నీలంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక శాస్త్రం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా వీరభద్రం

భిక్కనూరు, మార్చి 27: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో సామాజికశాస్త్రం విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరభద్రం నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ చేతులమీదుగా ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
దర్శన్	- రజాకార్
శాంతి	- ప్రేమలు
ప్రియా 70	- భీమా
ప్రియా 35	- ఓ భీం బూష్

బాన్సువాడ	
మహేశ్వరి	- ఓం భీం బుష్
వెంకటేశ్వర	- రజాకార్



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

